క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట): కలెక్టర్ ఆనంద్‌ను నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ పాల్గొన్నారు.

మురుగులోనే రాకపోకలు

- విజయమహల్ గేట్ అండర్ బ్రిడ్జి వద్ద దుస్థితి



నెల్లూరు(బారకాసు): విజయమహల్ గేట్ సమీపంలోని బాక్స్‌టైప్ బ్రిడ్జిలో మురుగు నిల్వ ఉంటోంది. వాస్తవానికి వర్షంతో ఇక్కడ నీరు నిల్వ చేరితే దాన్ని తోడేసేందుకు వీలుగా మోటార్లను ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన వర్షానికి అండర్ బ్రిడ్జిలో చేరిన నీటిని పూర్తి స్థాయిలో తొలగించలేదు. దీంతో నాలుగు రోజులుగా మురుగుపైనే వాహనాలు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. మురుగు ఎగసిపడుతుండటంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ట్రాఫిక్ స్తంభించిన సమయాల్లో మురుగుపై కాళ్లు పెడుతుండటంతో చర్మ వ్యాధులు వస్తాయేమోనని బెంబేలెత్తుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

మద్యం దుకాణాలను తొలగించాల్సిందే



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నూతన మద్యం పాలసీని తీసుకొచ్చి ఇళ్ల మధ్య వైన్ షాపులను ఏర్పాటు చేయడంతో మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు పేర్కొన్నారు. బాలాజీనగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. నగరంలో కొన్ని దుకాణాల విషయంలో వ్యతిరేకత వస్తున్నా, అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇళ్ల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను తొలగించాలనే డిమాండ్‌తో గాంధీబొమ్మ నుంచి వీఆర్సీ సెంటర్ వరకు నిరసన ర్యాలీని శనివారం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. అప్పటికీ అధికారులు స్పందించకపోతే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యులు మస్తాన్‌బీ, కాయం శ్రీనివాసులు, నాగేశ్వరరావు, నగర కమిటీ సభ్యులు కత్తి పద్మ, నరసింహ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

వైన్ షాపు వద్ద ధర్నా



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని మైపాడు రోడ్డులో గల శ్రీనివాసనగర్‌లో ఏర్పాటు చేసిన మద్యం షాపును ఎత్తేయాలంటూ దుకాణం వద్ద మహిళలు ధర్నాను శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తాన్‌బీ, నగర కార్యదర్శి పద్మ మాట్లాడారు. నిరసన చేస్తున్న మహిళలపై కేసులు బనాయించి, జైలుకు పంపుతామంటూ పోలీసులు, ఎక్సైజ్ అధికారులు బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఐద్వా నేతలు శివకుమారి, రెహానాబేగం, సీపీఎం, డీవైఎఫ్ఐ నేతలు చిరంజీవి, ఏమేలు, నరసంహ, ధనలక్ష్మి, రత్నమ్మ, లక్ష్మీప్రియ, ఆదిలక్ష్మి, సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను పరిష్కరించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్): పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. తన కార్యాలయంలో నగర ఇన్‌స్పెక్టర్లతో నెలవారీ నేర సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. స్టేషన్ల వారీగా గ్రేవ్ కేసుల రికార్డులను పరిశీలించారు. ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, అన్వర్‌బాషా, మద్ది శ్రీనివాసరావు, రోశయ్య, కిశోర్‌కుమార్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఐటీడీఏ చేయూత

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): చిల్లకూరు మండలంలో రొయ్యలగుంట యజమాని వేధింపులను తాళలేక ఆత్మహత్యకు పాల్పడిన గూడూరుకు చెందిన గిరిజనుడు తుపాకుల కృష్ణయ్య కుటుంబానికి ఐటీడీఏ చేయూతనందించింది. రూ.10 వేల నగదు, రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను ఐటీడీఏ ఏపీఓ రమణయ్య శుక్రవారం అందజేశారు.

పెద్దాస్పత్రిలో అగచాట్లే..!

- ఎమ్మారై, సీటీ టెక్నీషియన్ కొరత
- ఎమర్జెన్సీ కేసుల్లో రోగికి ప్రాణ సంకటం
- పరీక్ష చేసినా ఫిల్మ్‌ను ఇవ్వని వైనం



ఎమ్మారై, సీటీ స్కానింగ్ గది

నెల్లూరు (అర్బన్): జిల్లాకే రెఫరల్ ఆస్పత్రిగా ఉన్న నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో సమస్యలు వేధిస్తున్నాయి. ఎమ్మారై, సీటీ టెక్నీషియన్ల కొరతతో అత్యవసర సమయాల్లో రోగి పరిస్థితి ప్రాణ సంకటంగా మారుతోంది. వాస్తవానికి గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఆధునిక ఎమ్మారై, సీటీ స్కానింగ్ యంత్రాలను ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎమ్మెస్ఐడీసీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వీటికి గానూ ముగ్గురు టెక్నీషియన్లను నియమించారు. పెద్దాస్పత్రిలో వైద్యం చేయించుకునే రోగులకు ఉచితంగా.. బయటి ఆస్పత్రుల నుంచి వచ్చే రోగులకు 50 శాతం రాయితీపై ఈ పరీక్షలను చేసే సౌకర్యాన్ని కల్పించారు. దీంతో రోగులకు ఎంతో ఉపయోగంగా ఉండేది. వీటి నిర్వహణ బాధ్యతను ఏపీఎమ్మెస్ఐడీసీ పర్యవేక్షించేది.

నేడు ఇలా..

ముగ్గురు టెక్నీషియన్లు మూడు షిఫ్టుల్లో పనిచేసేవారు. ఈ క్రమంలో దాదాపు ఐదు నెలల క్రితం ఓ టెక్నీషియన్ పని ఒత్తిడితో ఉద్యోగం మానేశారు. దీంతో ఇద్దరే మిగిలారు. రోజూ 40కుపైగా సీటీ.. 20 వరకు ఎమ్మారై స్కాన్ పరీక్షలు జరుగుతున్నాయి. ఒక ఎమ్మారై పరీక్ష చేసేందుకు కనీసం 20 నిమిషాల సమయం పడుతోంది. షిఫ్టులో ఉండే ఒకే టెక్నీషియన్ ఈ రెండు పరీక్షలను చేయాల్సి వస్తోంది. ఖాళీగా ఉన్న పోస్టును భర్తీ చేయకపోవడంతో ఉన్న వారిపై భారం పడుతోంది. కనీసం జ్వరమొచ్చినా సెలవు పెట్టే పరిస్థితి లేదంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. అత్యవసర సమయాల్లో మూడో షిఫ్టులో పనిచేసేందుకు టెక్నీషియన్ లేరు. దీంతో రోగులకు వేగంగా ఎమ్మారై చేయలేక, మరుసటి రోజు వచ్చి చేయించుకునేలా అపాయింట్‌మెంట్ ఇస్తున్నారు.

రోగుల అవస్థ

రోగుల ప్రాణాల మీదకొచ్చినా పరీక్ష చేసే పరిస్థితే లేదు. ఇక్కడ స్కానింగ్ చేయించుకుంటే ఫిల్మ్‌లు ఇచ్చే అవకాశమే కానరావడంలేదు. ఫలితంగా రోగుల అవస్థలు వర్ణనాతీతమవుతున్నాయి. మరో టెక్నీషియన్‌ను ఇప్పటికైనా నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాగా ఈ విషయమై ఏపీఎమ్మెస్ఐడీసీ అధికారులను సంప్రదించగా, గడిచిన ఐదు నెలల్లో ఇదే విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని, అయినా నియమించలేదని బదులిచ్చారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



కేవీకేను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని రైతులకు శాస్త్రవేత్తలు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకుడు శివన్నారాయణ పేర్కొన్నారు. నగరంలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని శుక్రవారం సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. వరద ముంపునకు గురైన ప్రాంతాలను సందర్శించి రైతులకు సలహాలు, సూచనలివ్వాలని కోరారు. కేవీకే కోఆర్డినేటర్ లలితా శివజ్యోతి, శాస్త్రవేత్తలు కదిరి మోహన్, లోకేష్‌బాబు, కిరణ్‌కుమార్‌రెడ్డి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా విజిలెన్స్ వాకథాన్



నెల్లూరు(సెంట్రల్): విజిలెన్స్‌పై అవగాహన నిమిత్తం వాకథాన్‌ను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ ఆఫీస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ రీజనల్ హెడ్ రాజశేఖరం మాట్లాడారు. అవినీతి నిర్మూలనకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించే నిమిత్తం కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. డిప్యూటీ రీజినల్ హెడ్‌లు వేణుగోపాల్, శివశంకర్, విజిలెన్స్ అధికారి వాజిద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదాల జన్మదినం



అల్పాహారాన్ని అందజేస్తున్న కొండ్రెడ్డి రంగారెడ్డి

నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలను నగరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను జరిపారు. కార్యక్రమాలకు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు.

- దర్గామిట్టలోని విశ్వభారతి అంధుల పాఠశాల, బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో కేక్‌ను కట్ చేసి అల్పాహారాన్ని అందజేసి అన్నదానాన్ని నిర్వహించారు. పార్టీ నేత కల్లూరు లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- అంధుల పాఠశాలలో పిల్లలకు స్నాక్స్‌ను ఏఎంసీ మాజీ డైరెక్టర్ స్వర్ణా జీవన్‌ప్రసాద్ పంపిణీ చేశారు.
- రక్తదాన శిబిరాన్ని పార్టీ నేత వంశీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. పార్టీ నేత ఆదిత్య, అంధుల పాఠశాల కరస్పాండెంట్ ప్రభావతి, గీతామయి వృద్ధాశ్రమ నిర్వాహకుడు తమ్మినేని పాండు, కొండేటి నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించాలని వినతి



నెల్లూరు(దర్గామిట్ట): గిడ్డంగి వీధిలోని సత్రం పక్కన ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజ్ కవరింగ్ బాక్సు లేకపోవడంతో ఇబ్బందిగా ఉంటోందని ఆ ప్రాంతవాసులు పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. ఇటీవల వర్షాలు పడిన సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పురవ్వలొచ్చాయని తెలిపారు. ఈ విషయాన్ని కోటమిట్ట ఏఈ నజురుల్లాకు తెలియజేయగా, బాక్సుల్లేవని చెప్పారన్నారు. ఖాదర్‌బాషా, రాజశేఖర్, హేమంత్, రాము, దినేష్, కృష్ణమూర్తి, శ్రీహరిరావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే చర్యలు



నెల్లూరు(అర్బన్): స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేశారని తేలితే కేసులు నమోదు చేసి, వాటిని సీజ్ చేస్తామని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, పీసీ అండ్ పీఎన్డీ యాక్ట్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి పేర్కొన్నారు. నగరంలోని శిరీష్ స్కానింగ్ సెంటర్, రత్నసాయి డయాగ్నొస్టిక్స్ సెంటర్లను డెమో అధికారి కనకరత్నంతో కలిసి ఆకస్మికంగా శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులు, నివేదికలు, ఫారం – ఎఫ్‌ను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. ధరల పట్టికను కేంద్రాల వద్ద ప్రదర్శించాలని కోరారు. గర్భిణుల వివరాలను పోర్టల్లో నమోదు చేసి నివేదికను జిల్లా వైద్యశాఖ అధికారికి ప్రతి నెలా రెండులోపు అందజేయాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి పార్కు



మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్): అన్నమయ్య సర్కిల్ సమీపంలోని ఎన్టీఆర్ పార్కును త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. 19వ డివిజన్లోని పార్కును శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. నుడా, కార్పొరేషన్ అధికారుల సమన్వయంతో పార్కులో అన్ని సౌకర్యాలను కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు సబ్‌స్టేషన్లలో మరమ్మతులను చేపట్టనున్న నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 / 11 కేవీ ఏకేనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని రెవెన్యూ కాలనీ, పోలీస్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి 10.30 వరకు సరఫరా ఉండదన్నారు.

- బీవీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని మాగుంట లేఅవుట్లో గల 8, 9, 10వ వీధులు తదితర ప్రాంతాల్లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 రకు సరఫరా ఉండదని చెప్పారు.

పాలకమండళ్లలో అవకాశం కల్పించడంపై హర్షం

నెల్లూరు(బృందావనం): దేవస్థానాల పాలక మండళ్లలో నాయిబ్రాహ్మణులకు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడంపై నాయీబ్రాహ్మణ ఎంప్లాయీస్ సొసైటీ హర్షం వ్యక్తం చేసింది. నవాబుపేటలోని ఎస్వీఎమ్మార్ కల్యాణ మండపంలో సొసైటీ అధ్యక్షుడు వేలూరు రంగారావు అధ్యక్షతన సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సొసైటీ ప్రధాన కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు, కార్యదర్శి హజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

28న శివపార్వతుల కల్యాణం

నెల్లూరు(బృందావనం): కోవూరులోని బజార్ వీధిలో గల కామాక్షి సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాన్ని ఈ నెల 28న నిర్వహించనున్నామని పండితుడు ఆలూరు శిరోమణిశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

జీవన మహాసందేశంపై ఉపన్యాసం రేపు

నెల్లూరు(బృందావనం): మనుచరిత్ర – అల్లసాని పెద్దన జీవన మహాసందేశం అనే అంశంపై పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో ఉపన్యాసాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక నిర్వాహకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, శేషగిరీశం శుక్రవారం ఒక ప్రకటనను విడుదల చేశారు.

ఎన్‌హెచ్ పీడీతో ఎంపీ భేటీ



నెల్లూరు(బారకాసు): నెల్లూరులోని జాతీయ రహదారుల సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎమ్కే చౌదరిని ఆయన కార్యాలయంలో తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి శుక్రవారం కలిశారు. తిరుపతి లోక్‌సభ పరిధిలో సాగరమాల కార్యక్రమం ద్వారా పురోగతిలో ఉన్న వివిధ జాతీయ రహదారి పనులను అడిగి తెలుసుకున్నారు. పురోగతిలో ఉన్న రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కోరారు.

ప్రసన్నకు శుభాకాంక్షలు



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో ఆప్కాఫ్ మాజీ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, పొన్నాల కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు.

తక్కువ ఖర్చుకే మోకాలి ఆపరేషన్లు



మాట్లాడుతున్న శ్రీరామ్ సతీష్

నెల్లూరు(అర్బన్): నగరంలోని అపోలో ఆస్పత్రిలో 30 శాతం వరకు రాయితీతో అధునాతన రోబోటిక్ మోకాలి కీలు మార్పిడి ఆపరేషన్లు చేస్తున్నామని హాస్పిటల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ శ్రీరామ్ సతీష్ పేర్కొన్నారు. ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ వివేకానంద రెడ్డి మాట్లాడారు. ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ విభాగాన్ని ప్రారంభించిన పదేళ్లలో మూడు వేలకుపైగా మోకాలి కీలు మార్పిడి ఆపరేషన్లను చేయడం గొప్ప విషయమని చెప్పారు. ఆపరేషన్ సందర్భంగా అవసరమయ్యే అన్ని రకాల రక్త, మూత్ర, స్కానింగ్ లాంటి పరీక్షలను ఉచితంగా చేస్తామని తెలిపారు. రోబోటిక్ ఆపరేషన్ చేయించుకుంటే కోత తక్కువగా ఉంటుందని, రక్తస్రావం జరగదని, నొప్పీ దాదాపుగా ఉండదన్నారు. రెండు రోజులకే డిశ్చార్జి చేస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్థోపెడిక్ శశిధర్‌రెడ్డి, యూనిట్ హెడ్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

డీఈఓను కలిసిన ఏపీటీఎఫ్ నేతలు



నెల్లూరు (టౌన్): డీఈఓగా బాధ్యతలు చేపట్టిన బాలాజీరావును ఏపీటీఎఫ్ నేతలు మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, బాధ్యులు పిచ్చిబాబు, రియాజ్, జుల్ఫికర్ అలీ, మురళీకృష్ణ, రాజశేఖర్‌గుప్తా, వెంకటేశ్వరరెడ్డి, రత్నయ్య, సుధాకర్, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులను కాపాడుదాం



మాట్లాడుతున్న పద్మావతి

నెల్లూరు(అర్బన్): చట్టాలను సమర్థంగా అమలు చేయడం ద్వారా బాలల హక్కులను కాపాడుకుందామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి పేర్కొన్నారు. నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశం అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల అపహరణ, బాలికలపై లైంగిక దాడులు జరగకుండా మహిళా, శిశు సంక్షేమాధికారులు, పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయాలని కోరారు. బాలకార్మికులను గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించి, 60 మందిని పాఠశాలల్లో చేర్పించామని తెలిపారు. ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, కార్మిక శాఖ జిల్లా ఉప కమిషనర్ వెంకటేశ్వరరావు, జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్, బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మాధవి, సమత తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్ పోటీలకు 'రత్నం' విద్యార్థి



విద్యార్థికి అభినందన

నెల్లూరు (టౌన్): జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు రత్నం విద్యార్థి జస్మిత ఎంపికైందని విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు తెలిపారు. నగరంలోని రత్నం స్కూల్లో విద్యార్థినిని శుక్రవారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. కాకినాడలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో రోలర్ స్కేటింగ్ రింక్ – 1లో కాంస్య, రింక్ – 2లో రజత పతకాన్ని సాధించిందని చెప్పారు. మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపల్ మణిమాల పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నెల్లూరు(అర్బన్): బుజబుజనెల్లూరు నాగమ్మకాలనీలోని స్వర్ణదీపం చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులను వసుజ్యోతి చారిటబుల్ ట్రస్ట్, పీహెచ్‌పీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. డ్యూటీస్ సేవా సంస్థ అధ్యక్షుడు నూనె వెంగయ్య, వసుజ్యోతి ట్రస్ట్ చైర్‌పర్సన్ వసుంధర, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, పీహెచ్‌పీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, మహబూబ్‌బాషా, రవి, విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలను వ్యతిరేకించాలి



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు సిటీ: జమిలి ఎన్నికలను వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. దేవరపాళెంలో శుక్రవారం నిర్వహించిన సీపీఎం మహాసభల్లో పార్టీ నేత మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడారు. పూర్వవైభవాన్ని నూతన మండల కమిటీ తీసుకురావాలని సూచించారు. నేతలు ముత్యాల నాగయ్య, ఆలూరు తిరుపాల్, అల్లాడి గోపాల్, గండవరపు శేషయ్య, మండల కమిటీ సభ్యులు పల్లవరపు చెంచయ్య, వెంకయ్య, ముత్యాల నాగయ్య, బాలు ఆదిశేషయ్య, గడ్డం వెంకటేశ్వర్లు, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తైలాధివాసం



కలశస్థాపన



చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని కుర్తాళం సిద్ధేశ్వరి పీఠపాలిత గురుదత్తాత్రేయ మఠంలో సౌభాగ్య సరస్వతి అమ్మవారు, పరివార దేవతల విగ్రహ ప్రతిష్ట, మహాకుంభాభిషేక మహోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా యాగశాల ప్రవేశం, కలశస్థాపన, మండపారాధన, హోమాలు, తైలాధివాసాన్ని శుక్రవారం జరిపారు. భారతీయ సనాతన, సంప్రదాయాలను పరిఢవిల్లజేస్తూ ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కుర్తాళం సిద్ధేశ్వరి పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి, పీఠ ఆస్థాన పండితుడు మాచవోలు రమేష్‌శర్మ, మఠం మేనేజర్ అనూరాధ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో తిరుపతి శక్తిపీఠాధీశ్వరులు రమ్యానందభారతి, ప్రతిష్ట మహోత్సవ ఆహ్వాన కమిటీ నిర్వాహకులు పత్రి గురురాజా, పాలడుగు సాయి, రాజా శ్రీనివాసరావు, శ్రీధర్, మధుసూదన్‌రావు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

దేవతారాధనతో సకల సంపదలు

దేవతామూర్తులను మనోవాచకాలతో ఆరాధిస్తే కోర్కెలు ఇట్టే నెరవేరుతాయని కుర్తాళం సిద్ధేశ్వరి పీఠాధిపతి సిద్ధేశ్వరానందభారతి అనుగ్రహభాషణ చేశారు. ఆలయాల్లో ప్రతిష్ఠితమైన దేవతామూర్తులు విశేషాలను వివరించారు.